క్లుప్తంగా

పెట్టుబడులకు ఆసరా 'పెసర'



తట్టెపల్లిలో కాత కొచ్చిన పెసర పంట

పెద్దేముల్: వరుస వర్షాలకు పోయిన పంటలు పోగా.. ఉన్న కాస్త పెసర చేతికి అందడంతో రైతులకు కాస్త ఊరట కలిగింది. పెద్దేముల్ మండలం తట్టెపల్లి, పెద్దేముల్, ఆత్కూర్, నర్సపూర్, మంబాపూర్, మారేపల్లి, రుద్రారం, నర్సపూర్ తదితర గ్రామాల్లో రైతులు పెసర సాగు చేశారు. పంట మూడు నెలలకు చేతికి రావడం, ఇతర పంటల పెట్టుబడులకు ఆసరా కావడంతో రైతులు క్రమం తప్పకుండా పెసరను పండిస్తుంటారు. రెండేళ్ల నుంచి భారీ వర్షాల కారణంగా పంటలు నీటిపాలై.. పెట్టుబడులు కోల్పోతున్నామని చెప్పారు. పెసర ఎకరాకు సుమారు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చి, లాభదాయకంగా ఉందని రైతులు తెలిపారు. గుంత పొలాలు వర్షాలకు పాడైనా.. గడ్డ భూములు బాగున్నాయని, వాటిపైనే తమ బతుకులు ఆధార పడి ఉన్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

పూడూరు: కాంగ్రెస్ పార్టీ పూడూరు మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ తెలిపారు. మన్నెగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి రానున్నారని వెల్లడించారు. కావున మండల పరిధి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విజయలక్ష్మికి పీహెచ్‌డీ పట్టా



పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న విజయలక్ష్మి

యాలాల: అగ్గనూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మోనాడ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికవృద్ధి, ఆదాయ, అసమానతల మధ్య సంబంధాలను అంచనా వేయడానికి సమగ్ర అధ్యయనం అనే అంశంలో పీహెచ్‌డీని పూర్తి చేయగా.. విశ్వ విద్యాలయం నుంచి శనివారం పట్టా అందుకున్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని ఎన్‌టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. విజయలక్ష్మి పీహెచ్‌డీ పట్టా పొందడంతో ఆమె తల్లిదండ్రులు బస్వరాజ్, గౌరమ్మ, సర్పంచ్ భీమప్ప, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కొడంగల్: నియోజకవర్గంలోని పలు సబ్‌స్టేషన్లలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. కొడంగల్‌లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సరఫరా నిలిపివేస్తామని వెల్లడించారు. 33 కేవీ కొడంగల్ ఫీడర్, కొడంగల్ సబ్‌స్టేషన్, పెద్ద నందిగామ సబ్‌స్టేషన్, నర్సాపూర్, సూరాయిపల్లి, దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ల పరిధిలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓవైసి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ పీఆర్‌ఓ డాక్టర్ యాసిన్ అన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ఓవైసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ టికెట్ ఎవరికైనా ఓకే

బంట్వారం: తాండూరు కాంగ్రెస్ టికెట్ మాణిక్‌రావు, ధారాసింగ్ ఇద్దరిలో ఎవరికిచ్చినా ఓకేనని, గత ఎన్నికల మాదిరిగా జరగొద్దని మాజీ జెడ్పీటీసీ అంజయ్య అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడారు. గత ఎన్నికల్లో తాండూరు నుంచి కాంగ్రెస్ బీఫారం పై గెలిచిన రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరాడన్నారు. నమ్మి టికెట్ ఇచ్చిన పార్టీకి, గెలిపించిన కార్యకర్తలకు పైలెట్ మోసం చేశారని మండిపడ్డారు. ఈ సారి మాణిక్‌రావ్, ధారాసింగ్ ఇద్దరిలో ఎవరికైనా తాండూరు టికెట్ ఇవ్వాలని ఆయన పార్టీ పెద్దలను కోరారు.

పునాదులకే పరిమితం!

'పల్లెప్రగతి' కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల జాప్యంతో అభివృద్ధి కుంటుపడుతోంది. దేశానికి వెన్నెముక లాంటి గ్రామాల్లో పాలనాపరమైన అంశం సాఫీగా సాగించేందుకు లేని పంచాయతీలకు కొత్తగా భవనాలు మంజూరు చేసింది. అందుకు ఉపాధిహామీ పథకం కింద నిధులు కేటాయించింది. కానీ.. జవాబుదారి తనం లేని పాలకులతో చాలాచోట్ల అవి పునాదులకే పరిమితం అయ్యాయి.



వీర్లపల్లిలో అసంపూర్తిగా పంచాయతీ భవనం (ఫైల్)

పల్లెప్రగతి పట్టని పాలకులు
- జీపీ భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం
- నిధులున్నా.. అధికారుల నిర్లక్ష్యం
- నిర్మాణ దారుల ఇష్టారాజ్యం
- సమీక్షలు నిర్వహించేందుకు పాలకవర్గం పాట్లు

మర్పల్లి: మండల పరిధిలో 27 గ్రామపంచాయతీలు ఉండగా 19 జీపీ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు ఒక్కోదానికి రూ.12.50 లక్షలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదటి విడతలో 11 భవనాలు, రెండో విడతలో 8 భవనాలు నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడత 11 భవనాలకు నిధులు సమకూర్చగా.. బూచన్‌పల్లి, కల్‌ఖోడ, దామస్తాపూర్, తుమ్మలపల్లి, పిల్లిగుండ్ల, రావులపల్లి, బిల్‌కల్, పెద్దాపూర్ 8 గ్రామాల్లో భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చారు. వీర్లపల్లి భవన పనులు అసంపూర్తిగా ఉండగా.. కొంషేట్‌పల్లి, మర్పల్లిలో అసలు నిర్మాణ పనులే చేపట్టలేదు.

పునాదులకే..

రెండో విడతలో 8 భవనాల పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఏ ఒక్క గ్రామ పంచాయతీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. సిరిపూరం భవనం పునాదులకే పరిమితం కాగా.. ఘనాపూర్ భవన పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. పట్లూర్, పంచలింగాల, కొత్లాపూర్, నర్సాపూర్, మొగిలిగుండ్ల, కోట్‌మర్పల్లిలో ఇంతవరకు పనులు చేపట్టలేదు. దీంతో పంచాయతీ పాలకవర్గం సమావేశాలు నిర్వహించేందుకు కార్యదర్శులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర మనుకుంటే తప్ప సమావేశాలు పెట్టడం లేదని వార్డు సభ్యులు వాపోతున్నారు. కొంత మంది సర్పంచ్‌లు తమకు తెలియకుండానే సమీక్షలు ఏర్పాటు చేసినట్లు తమ చేత సంతకాలు తీసుకుంటున్నారని పాలకవర్గం ఆరోపిస్తోంది.

భవనాలకు నోచుకోని కొత్త జీపీలు

ఇటీవల కొత్తగా ఏర్పడిన 8 గ్రామ పంచాయతీలకు, గతంలో భవనాలు లేని 7 గ్రామాలను కలిపి, ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు చొప్పున మెత్తం 15 గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో నేటి వరకు 10 గ్రామాల్లో మాత్రమే నిర్మాణ పనులు చేపట్టారు. మరో ఐదింటికి ముహూర్తమే ఖరారు కాలేదు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని పంచాయతీ పాలకవర్గం, స్థానికులు కోరుతున్నారు.

ఒకేసారి పోటీ పరీక్షలు తగదు

- సమయం లేక నష్టపోతున్న విద్యార్థులు
- గ్రూప్-2 వాయిదా వేయాలి: బీఎస్పీ



మర్పల్లి: అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

మర్పల్లి: ఒకేసారి పోటీ పరీక్షలు ఉండటం వలన విద్యార్థులు నష్టపోతున్నారని, పరీక్షకు పరీక్ష మధ్య గడువు ఉండేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ నియోజకవర్గం బీఎస్పీ ఇన్‌చార్జి తలారి రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పర్వేద శ్రీనివాస్ అధ్యక్షతన చేపట్టిన నిరసన కార్యక్రమంలో ముందుగా పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్లకార్డులు చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ ర్యాలీ తీశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ఈ నెల 29,30న (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించే గ్రూప్-2 పరీక్ష వలన విద్యార్థులు నష్టపోతారని, ఆ ఎగ్జామ్‌కు ముందు గురుకుల పాఠశాలలో చేరేందుకు ఉపాధ్యాయ రాత పరీక్షలు, జూనియర్ లెక్చరర్ నియామక పరీక్షలు ఇలా ఒకేసారి ఉండటం వలన వారికి ఇబ్బందులు తలెత్తనున్నాయని వాపోయారు. కొంత సమయం ఇస్తే పరీక్షలకు సన్నద్ధమై ప్రశాంతంగా రాసుకోవడానికి వీలు ఉంటుందని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గం కోకన్వీనర్ సయ్యద్ అమీర్, అసెంబ్లీ మహిళ కార్యదర్శి నర్సమ్మ, నాయకులు విజయ్, శ్రీను ఉన్నారు.

మూడు నెలలు వాయిదా వేయాలి

కొడంగల్: బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగడి రాయిచూర్ నర్మద కిష్టప్పను కొడంగల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సత్యాగ్రహ దీక్షకు వెళ్తున్న నర్మదను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షను మూడు నెలలు వాయిదా వేసి, పరీక్ష రాయనున్న అభ్యర్థులకు వెసలుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బహుజనులకు న్యాయం చేయాలన్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: అడవివెంకటాపూర్ గ్రామానికి చెందిన విఠల్ నాయక్ ముంబాయికి వెళ్లి జీవనం సాగిస్తూ అనారోగ్య సమస్యతో మృతిచెందాడు. మరో వ్యక్తి బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బెస్త శంకరయ్య మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ స్థానిక నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. టీడీపీ జిల్లా నాయకుడు బాలముకుందం, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్ అంజిలయ్య, మొగులయ్య, ఊరడి రాజు, వెంకటయ్య ఉన్నారు.

దారుణివాగుతండాలో విలీనం వద్దు

- జయరాంతండాలోనే ఉంటాం
- ఒంటి మామిడితండా గిరిజనులు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజనులు

పెద్దేముల్: 'పెద్దేముల్ మండలం జయరాంతండాలో వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ కొత్త గ్రామపంచాయతీ దారుణివాగుతండాలో తండాను కలపడం ఎంత వరకు న్యాయం' అని ఒంటి మామిడితండా గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం సర్పంచ్ శేవిలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దారుణివాగుతండా పంచాయతీ మాకు వద్దు.. జయరాంతండా ముద్దంటూ నినదించారు. అనంతరం గ్రామ పెద్దలు పూర్యానాయక్, విఠల్, మోహన్, పరశురాం, జెక్యానాయక్, శంకర్, పూర్యనాయక్ మాట్లాడారు. తమ సమస్య గురించి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, కలెక్టర్, డీపీఓలకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు.

జయరాంతండాలోనే కొనసాగాలి

గతంలో జయరాంతండా పంచాయతీకి దారుణివాగుతండా, ఒంటి మామిడితండా అనుబంధ గ్రామాలుగా ఉండేవని, కొత్తగా ఏర్పాటు చేసిన దారుణివాగుతండా పంచాయతీలో ఒంటి మామిడితండా విలీనం కావడానికి తండా వాసులు ఇష్టపడటం లేదని సర్పంచ్ పేర్కొన్నారు. ఇప్పటికే కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఎలాంటి వసతులు లేని దారుణివాగుతండాల్లో తండాను కలపడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ప్రస్తుతం జయరాంతండా (ఇందూరు) గ్రామ పంచాయతీలో తండా కొనసాగాలని ఒంటి మామిడి ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని సర్పంచ్ కోరారు.

కాంగ్రెస్ వస్తే సంక్షేమ పథకాలు కట్

- బంగారు తెలంగాణ కావాలంటే కేసీఆర్‌ను ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



కుల్కచర్ల: గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి తదితరులు

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకుంటేనే అన్ని పథకాలు కొనసాగుతాయని, కాంగ్రెస్‌కి ఓటేస్తే అవి కట్ అవుతాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం కామునిపల్లిలో సర్పంచ్ మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపిస్తుందని, గతంలో తాగునీటి సరఫరాకే అధిక నిధులు ఖర్చు చేయాల్సి ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని చెప్పారు.

సాగుకు 24గంటల విద్యుత్

పొలాలకు సాగునీరు అందించేందుకు రైతులు రాత్రుళ్లు పొలాల వద్ద పడిగాపులు కాసేవారని, ఇబ్బందిని గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ సాగుకు 24గంటల విద్యుత్తును సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇది గిట్టని కాంగ్రెస్ నేతలు కేవలం 3గంటలు ఇస్తే సరిపోతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను కాంగ్రెస్ వస్తే రద్దు చేస్తుందని, బంగారు తెలంగాణ కావాలంటే కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, వైస్ ఎంపీపీ రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షులు రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, స్థానిక ఎంపీటీసీ చందన, పంచాయతీరాజ్ డీఈ ఉమేష్, నాయకులు రాజప్ప, సార శ్రీనివాస్, కొండయ్య, తులసిరాం, మొగులయ్య, పెంటయ్య, తిరుపతి, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలుగా పల్లెలు

పరిగి: గ్రామాల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి మండలం చిట్యాలలో నూతనంగా నిర్మించిన జీపీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాక ముందు గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవని, తెలంగాణ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. పల్లెలను పట్టణాలను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని, ప్రతి గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం, మురుగు కాలువలు ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, సర్పంచ్ రజిత, నాయకులు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జీపీ ఏర్పాటుపై హర్షం

పూడూరు: పూడూరు మండలం తిరుమలాపూర్ నుంచి రాకంచర్లను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా రాకంచర్ల యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహ మాట్లాడారు. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి, అన్నివిధాల అభివృద్ధి చేయాలని కోరారు. నాయకులు కిషన్, బాలు, మల్లేశ్, రాము, నగేష్, వినోద్, రమేష్ ఉన్నారు.

పాలమూరు-రంగారెడ్డితోనే సాగునీరు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గులాబీ శ్రేణులు

త్వరలో కాలువల పనులు ప్రారంభం: బీఆర్‌ఎస్

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతోనే సాగునీరు అందుతుందని బీఆర్‌ఎస్ నేతలు చెప్పారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డికి పర్యావరణ అనుమతులు వచ్చాయని, తద్వారా నియోజకవర్గంలోని 1.49 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని పేర్కొన్నారు. కాలువల పనులు త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్ బాబు, అంజద్, దత్తురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టి ఎస్‌ఐ కొలువు సాధించి..

కావేరికి అభినందనలు



కావేరి ఎస్‌ఐ అభ్యర్థి

తాండూరు టౌన్: పేదరికాన్ని లెక్క చేయని యువతి కష్టపడి ఉన్నత కొలువును సాధించింది. లక్ష్య సాధనకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది. ఇటీవల విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో తాండూరు పట్టణం పసారీ వార్డుకు చెందిన వీరేశం, నిర్మల దంపతుల కూతురు దూది కావేరి ఎస్సై (సివిల్) ఉద్యోగం సాధించింది. తండ్రి పట్టణ శివారులోని ఓ స్పిన్నింగ్ మిల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. చిన్ననాటి నుంచి చదువుపై మక్కువ చూపే కావేరి పదో తరగతి స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్, ఇంటర్మీడియెట్ తాండూరు చైతన్య కళాశాలలో, డిగ్రీ ఓపెన్‌లో చదివింది. డీఎడ్ చదివి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న ఆమె.. హైదరాబాద్‌లో ఎస్సై పరీక్ష కోసం శిక్షణ తీసుకుంది. పట్టుదలతో ఎస్సై కొలువు సాధించింది. దీంతో కావేరిని కుటుంబసభ్యులు, స్నేహితులు అభినందనలతో ముంచెత్తారు.



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది, తపాలా ఉద్యోగులు

జాతీయ జెండాల పంపిణీ

యాలాల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యాలాల తపాలశాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను బీపీఎం మహమ్మద్ ఫిరోజ్ పంపిణీ చేశారు. రూ.25కు జెండాలను విక్రయించినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువకులకు జెండాలను పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం యాలాల ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌కు పతాకాన్ని అందజేశారు.



ఎస్సై పరీక్ష ఫలితాల్లో విజయం సాధించిన పులుసుమామిడి గ్రామానికి చెందిన హిమ బిందును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్. చిత్రంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు ఉన్నారు. - అనంతగిరి

ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతగిరి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ అటెండర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కష్టపడితే అధికారం కాంగ్రెస్‌దే

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆశాభావం వ్యక్తంచేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన జోడాయాత్రలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని, కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంకు ఏ పార్టీకి పోలేదని, కష్టపడితే అధికారం మనదే అని పేర్కొన్నారు. వరంగల్ డిక్లరేషన్‌ను ఇంటింటికీ తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఇజ్రాచిట్టంపల్లి గ్రామానికి చెందిన సభావత్ రాజును నియమించినట్లు ఆయన తెలిపారు.

'మా హయాంలోనే అభివృద్ధి'

బంట్వారం: కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ ఆరోపించారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి జిన్నారంలో గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, ఆ రెండు పార్టీలను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాచిరెడ్డి, అక్బర్, రాము నాయక్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

బడిని అభివృద్ధి చేయాలి

కొత్తూరు: ఉర్దూ మీడియం పాఠశాలలను అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు లతీఫ్ విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుత పాఠశాలలకు సొంత భవనాలు, తగినంత బోధన సిబ్బంది లేరని పేర్కొన్నారు.

సీపీఎస్ వద్దు.. పాత పింఛన్ ముద్దు



పెద్దేముల్: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లిన ఉపాధ్యాయులు

సీపీఎస్ విధానంతో అభద్రతాభావం: ఉపాధ్యాయులు

పెద్దేముల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ సౌకర్యం కల్పించాలంటూ శనివారం పెద్దేముల్ మండల ఉపాధ్యాయులు ఛలో హైదరాబాద్‌కు వెళ్లారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో జరిపిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో పీఆర్‌టీయూ, టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల శాఖ నాయకులు ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, అనిల్, రవికాంత్‌రెడ్డి, నర్సిరెడ్డి, బందెప్ప, వెంకటరెడ్డి, గొబ్రానాయక్, శ్రీనివాస్, రవిందర్‌రెడ్డి, అశోక్, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, వెంకటయ్య, మణి, గాయత్రి, స్వర్ణలత, సోని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ పంతం

పరిగి: సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం అని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. శనివారం నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో టీఎస్‌సీపీఎస్‌ఈయూ నిర్వహించిన ఛలో హైరాబాద్ కార్యక్రమానికి పీఆర్‌టీయూ నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడారు. సీపీఎస్‌ను అంతం చేసేంత వరకు పీఆర్‌టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పీఆర్‌టీయూ ఎన్నో పరిష్కరించిందని, త్వరలోనే ఈ సమస్య కూడా పరిష్కారానికి వస్తుందని తెలిపారు. కార్యక్రమలో ఉపాధ్యాయ సంఘ నాయకులు భాస్కర్‌రెడ్డి, నరసింహారాజు, శ్రీనివాస్, మాణిక్యం పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: పాత పింఛన్ సాధన కోసం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపట్టిన 'పాత పెన్షన్ సహకార సభ'కు యాలాల మండల పీఆర్‌టీయు నాయకులు భారీగా వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. పీఆర్‌టీయూటీఎస్ మద్దతుతో టీఎస్‌సీపీఎస్ ఈయూ చేపట్టిన కార్యక్రమానికి ఉపాధ్యాయుల మద్దతు ఉందన్నారు. సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయుల్లో అభద్రతాభావంతో ఉన్నారని, సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు పరమేష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ్మారెడ్డి

మొయినాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కోర్టులో అనుమతి రావడంతో కేసీఆర్ చిత్రపటాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు క్షీరాభిషేకం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మాజీ సీఎం వైయస్సార్ రంగారెడ్డి జిల్లాకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో అంబేడ్కర్ చేవెళ్ల ప్రాణహిత అనే పేరుతో అప్పట్లో ఈ ప్రాజెక్టుకు నామకరణం చేసి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని 84 గ్రామాల్లో గుదిబండగా ఉన్న 111 జీవో ఎత్తివేసి సంబరాలు జరుపుకోవడం బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలకు గాను ఏడు స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.